క్లుప్తంగా

రైతు సంక్షేమానికి కృషి
మార్కెట్ చైర్‌పర్సన్ గీత


చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు, రైతులు

ఆమనగల్లు/ కడ్తాల్: రైతు సంక్షేమానికి కృషి చేస్తానని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత అన్నారు. బుధవారం పలువురు రైతులు, నాయకులు చైర్‌పర్సన్‌ను ఆమనగల్లులో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు రుణమాఫీ అందిందని, త్వరలో రైతుభరోసా అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కొనాపూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు శ్రీశైలం, గణేశ్, శ్రీను, రాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సర్వే


సర్వే చేస్తున్న వార్డు అధికారి ఎల్లయ్య తదితరులు

ఆమనగల్లు: మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం సంకటోనిపల్లి గ్రామంలో మున్సిపల్ అధికారి ఎల్లయ్య సర్వే చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి మహేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రవి, స్థానికులు శేఖర్, బాలయ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008–2009 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు మున్సిపల్ పరిధి ఓ రిసార్ట్‌లో బుధవారం సందడి చేశారు. 15 సంవత్సరాల అనంతరం కలుసుకోవడంతో సంతోషంగా కేరింతలు కొట్టారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, భిక్షపతి, కృష్ణమూర్తి, పాండు రంగం, కరుణాకర్‌రెడ్డి, విజయకుమారిలను ఘనంగా సత్కరించారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా గోపాల్


నూతన సభ్యులతో మాల నేతలు

యాచారం: మాల మహానాడు యాచారం మండల అధ్యక్షుడిగా అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన మండలి గోపాల్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, కన్వీనర్ మారయ్య ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా గోపాల్, కార్యదర్శిగా లకుమల్ల కృష్ణను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, ఎస్సీ వర్గీకరణపై తప్పుడు తీర్పులు ఇస్తే సహించేది లేదని పేర్కొన్నారు. నాయకులు మల్లేశం, భానుచందర్, రాములు, కృష్ణ, యాదయ్య, ధన్‌రాజ్, స్వరూప, శశికళ, సువర్ణ ఉన్నారు.

జగన్నాథంను పరామర్శించిన మాజీ ఎంపీ

ఆమనగల్లు: ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథంను బుధవారం మాజీ ఎంపీ రాములు పరామర్శించారు. అనంతరం జగన్నాథం కూతురు పల్లవి, కుమారుడు శ్రీనాథ్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బరత్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

తుక్కుగూడ: సర్దార్‌నగర్ నుంచి విద్యార్థులు మహేశ్వరం ప్రభుత్వ కళాశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. ఈ మేరకు బుధవారం మహేశ్వరం డిపో మేనేజర్‌కు స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

దడపుట్టిస్తున్న పొగమంచు

వణికిస్తున్న చలిపులి
- మంచుదుప్పటితో కనిపించని రోడ్లు
- గ్రామీణ ప్రాంత రోడ్లపై వరికుప్పలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


జాపాల రోడ్డులో (వరి కుప్పలు) మంచుపొగ

మంచాల: చలి తీవ్రత, మంచు ప్రభావంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా వీస్తున్న చల్లటి గాలులు, దానికి తోడు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులకు రోడ్డు కనిపించడం లేదు. లైట్లు వేసినా లాభం లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. పొలాలకు వెళ్లే రైతుల పరిస్థితి అదే విధంగా ఉంది. చలితో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా, చిన్నపిల్లలు బడికి వెళ్లాలన్నా.. గజగజా వణికి పోతున్నారు.

8 గంటలు దాటినా..

ఉదయం వేళలో అలా ఉండగా.. ఇక సాయంత్రం నాలుగు దాటిందంటే గ్రామీణ ప్రాంత ప్రజలు ముసుగేస్తున్నారు. రాత్రి 10.00 గంటల నుంచి మంచుతో కూడిన చలితో గజగజా వణికిపోతున్నారు. చలి మంటలు కాగుతున్నారు. ఉదయం 8 గంటలకు చలితీవ్రత ఏమాత్రం తగ్గకపోవడం, మంచుతెర తొలగక పోవడంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వణికిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ భయంగానే ప్రయాణం కొనసాగిస్తున్నారు.

రహదారిపై వరి కుప్పలు

చలి, పొగమంచుతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. రోడ్లపై పోసిన వరికుప్పలు ప్రమాదకరంగా మారాయి. మంచుతెరలో వరి కుప్పలు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. ఏమాత్రం ఆదమరచినా ముప్పుతప్పదని పలువురు పేర్కొంటున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



మంచుపొగతో రోడ్లు కనిపించడం లేదు. వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మలుపుల వద్ద, ప్రమాద సూచికలు గమనిస్తూ ముందుకు సాగాలి. కార్లు నడిపేవారు సీటు బెల్టు, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి. తగిన వేగంతో సురక్షితంగా ప్రయాణించండి.
– ఎ.మధు, సీఐ, మంచాల

ధర్మ పరిరక్షణే వీహెచ్‌పీ లక్ష్యం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: ధర్మ పరిరక్షణే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలుగా హిందూ సమాజాన్ని ఏకీకృతం చేస్తూ, లోక కల్యాణం కోసం, సమాజ సేవ చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. వీహెచ్‌పీ.. అయోధ్య రామ మందిరం కోసం చేసిన పోరాటాలు మరువలేనివని వెల్లడించారు. భజరంగ్‌దళ్ చేపట్టిన త్రిశూల్ దీక్షతో యువతలో చైతన్యం వస్తుందని చెప్పారు. గోహత్యలు, దేవాలయాల విధ్వంసం, హిందూ మహిళలపై లవ్ జీహాదిలను అరికట్టేందుకు భజరంగ్‌దళ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి


శివసేనారెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

బడంగ్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బాచుపల్లిలోని పల్లవి స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్‌జైట్ ఎలజైన్–2024 పేరుతో గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివసేనారెడ్డితో పాటు కల్నల్ అనిల్‌కుమార్, నేషనల్ బ్యాట్మింటన్ ప్లేయర్ చేతస్ ఆనంద్, ఇండియన్ మౌంటెనీర్ మలావత్ పూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయం సాధించాలంటే పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా మార్చ్ ఫాస్ట్, స్పార్కిల్ స్క్వాడ్, డాన్సింగ్ పెటల్స్, స్వే అండ్ స్ట్రేడ్ బాంబూ, బీట్స్ ఫ్లాగ్ ఆఫ్ యూనిటీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

'ఇందిరమ్మ' మోడల్ హౌస్

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టనున్న నమూనా భవనం
- అనంతరం లబ్ధిదారులకు అవగాహన
- ఒక్కో యూనిట్ విలువ రూ.5 లక్షలు
- నాలుగు విడతలుగా చెల్లింపు
- తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నమూనా

మహేశ్వరం: ఎన్నికల్లో ప్రకటించిన విధంగా పేదోడి సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా తొలుత ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. పరిశీలన ప్రక్రియ అనంతరం అధికారులు నిజమైన అర్హుల కోసం సర్వే చేస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు వారి వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పుడు ఏకంగా ఇళ్ల నమూనాలను శ్రీకారం చుట్టింది. ఈ ఆకృతుల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటూ లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నారు.

గృహ నిర్మాణ శాఖ ఆవరణలో..

ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. మహేశ్వరం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని గృహ నిర్మాణ శాఖ ఆవరణలో మోడల్ ఇంటి నిర్మాణానికి అనువైన స్థలాన్ని హౌసింగ్ డీఈ, ఏఈ, ఎంపీడీఓ, పంచాయతీరాజ్ ఏఈలు పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

దశలవారీగా చెల్లింపులు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చెల్లించనుంది. ఈ మొత్తాన్ని పునాది నుంచి స్లాబ్‌లెవల్, ప్లాస్టరింగ్ వరకు నాలుగు విడతల్లో అర్హుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనుంది. పునాది దశలో రూ.లక్ష, కిటికి దశలో రూ.1.75 లక్షలు, స్లాబ్ దశలో రూ.1.25 లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక మరో లక్ష ఇవ్వనుంది. దీంతో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం కేటాయించనుంది.

త్వరలో నిర్మాణం



ప్రతి మండల పరిషత్ కార్యాలయ పరిధిలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మోడల్ ఇంటిని వచ్చిన నిధులతో ఎలా నిర్మించుకోవాలనే దానిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాం. మహేశ్వరం, కందుకూరు మండల కేంద్రాల్లో మోడల్ హౌస్ నిర్మాణం కోసం గృహ నిర్మాణ శాఖ స్థలాన్ని పరిశీలించాం. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం.
– భూక్యా నాయక్, హౌసింగ్ డీఈ, మహేశ్వరం

నచ్చిన రీతిలో ఇళ్ల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల నమూనాను అనుసరించి బెడ్ రూమ్, అటాచ్ బాత్ రూమ్, కిచెన్, ప్రహరీ, స్లాబ్‌పైకి వెళ్లేందుకు మెట్ల నిర్మాణం తప్పనిసరి. కనీసం 400 ఫీట్లలో ఇంటి నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక స్తోమత ఉంటే 500 వరకు నచ్చిన రీతిలో నిర్మించుకునే అవకాశం కల్పించింది. ఈ డిజైన్‌లోనే నిర్మించుకోవాలని ఎలాంటి ఆదేశాలు పెట్టలేదు.


తుర్కయంజాల్: కేక్‌కట్ చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు


కడ్తాల్: యేహోవా నిస్సి మినిస్ట్రీస్ ప్రార్థనాలయంలో క్రిస్మస్ వేడుకలు

లోక రక్షకుడు యేసు ప్రభువు

'లోక రక్షకుడు యేసు ప్రభువు. సర్వ మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు ఆయన దివి నుంచి భువికి దిగివచ్చారు' అని వక్తలు అన్నారు. ఏసు జన్మదినం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు పరిధి ప్రాంతాల్లో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పాస్టర్లు దైవ సందేశం ఇచ్చారు. ప్రజల్లో శాంతి, ప్రేమ, దయాగుణం నింపడానికి ఆ కరుణామయుడు జన్మించారని పేర్కొన్నారు. ఆయన మార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. చిన్నారులు ఆటపాటలతో సందడిచేశారు.
–సాక్షి, నెట్‌వర్క్


యాచారం: కుర్మిద్ద ప్రార్థనాలయంలో భక్తులు


మాడ్గుల: బ్రహ్మణపల్లిలో..


కడ్తాల్: రావిచేడ్‌లో క్రిస్మస్ వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తదితరులు


ఆమనగల్లు: ఇమ్మానియేల్ బైబిల్ చర్చిలో..


ఇబ్రహీంపట్నం: మౌంట్ సీయోన్ గాస్పెల్ చర్చిలో మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి తదితరులు


ఇబ్రహీంపట్నం: మౌంట్ సీయోన్ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న భారతీ సిమెంట్ టీం

వాజ్‌పేయి సేవలు మరువ లేనివి

- దేశాభివృద్ధికి పాటుపడిన మహనీయుడు: బీజేపీ శ్రేణులు
- ఘనంగా వాజ్‌పేయి శతజయంతి



ఇబ్రహీంపట్నం: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: రాజ ధర్మాన్ని పాటించడమేగాక, భారతదేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిన మహోన్నతుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం వాజ్‌పేయి శత జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్నం ఓం కూడలిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. న్యూకియర్ పరీక్షలు చేయొద్దని ప్రపంచ దేశాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో.. ప్రొక్రన్‌లో అణుపరీక్షలు నిర్వహించి, దేశ సామర్థ్యాన్ని, శక్తిని చాటి చెప్పిన ఘనత వాజ్‌పేయికే దక్కిందన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి అటల్ పునాది వేసారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేనివన్నారు. పార్టీ నేతలు నర్సింహ్మారెడ్డి, ప్రతాప్, అర్జున్‌రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, రాములు, బూడిద నర్సింహ్మారెడ్డి, శ్రీశైలంలు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: ప్రధాన మంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు మరువ లేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకులు బాషయ్య, భిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంచాల: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

యాచారంలో..

యాచారం: వాజ్‌పేయి జయంతి సందర్భంగా యువమోర్చా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ వన్నెవాడ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీశైలం, శాంతికుమార్, బీరప్ప, నడుకుడి కృష్ణ, నాగరాజు, విజయకుమార్, శ్రీధర్‌గౌడ్, నరేష్ ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

హయత్‌నగర్: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని కొహెడలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కొత్తరామ్‌రెడ్డి, బల్‌దేవ్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు రెడ్యా, శంకర్‌నాయక్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: దివంగత నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీమోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహ గౌడ్, సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి ఉన్నారు.

ఐక్యంగా ధ్యాన జగత్ సాకారం

- పత్రీజీ ఆశయసాధనకు కృషి చేద్దాం
- మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- ఐదోరోజుకు చేరిన ధ్యాన మహాయాగాలు
- క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో కిటకిటలాడిన ధ్యాన కేంద్రం


నృసింహస్వామి నృత్య రూపకం

కడ్తాల్: పత్రీజీ కలలు సాకారం చేసేందుకు ధ్యానులు ఐక్యంగా పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వర పిరమిడ్‌లో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు బుధవారం ఐదో రోజుకు చేరాయి. ఈ వేడుకల్లో ధ్యాన గురువు పరిణీత పత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, సినీ స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్, పిరమిడ్ మాస్టర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వర మహా పిరమిడ్ కేంద్రం ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక ధ్యాన కేంద్రంగా విరాజిల్లుతుందని ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ చెప్పేవారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు పిరమిడ్ మాస్టర్స్ కృషి చేయాలన్నారు.

జీవహింస చేయొద్దు: పరిణీత పత్రీజీ

ధ్యాన గురువు పరిణీత పత్రీజీ ప్రసంగిస్తూ శ్వాస మీద ధ్యాసే ధ్యానమని.. ధ్యానంతో జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలన్నారు. పిరమిడ్ మాస్టర్ ధ్యాన జగత్ కోసం కృషి చేయాలని కోరారు. జీసస్ అంటే ప్రేమ, కరుణ, త్యాగమని సకల జీవకోటిని ప్రేమించాలన్నారు. జీవహింస చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్‌తో కలిసి పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పలు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. ధ్యాన వేడుకల్లో శ్రీకాకుళంకు చెందిన శివశ్రీ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన గోవింద కల్యాణం, శివపార్వతుల నృత్య రూపకం, నృసింహావతార నృత్య రూపకాలతో పిరమిడ్ పరిసరాలు మార్మోగాయి. వరుస సెలవులతో పెద్ద సంఖ్యలో ధ్యానులు పిరమిడ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంబాబు, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, సాంబశివ రావు, హనుమంతరాజు, హనుమంతరావు, దామోదర్‌రెడ్డి, శ్రీరాంగోపాల్, లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి